# సూట్‌కేస్

## విజయ

ఎయిరిండియా జెట్ లైనర్ 'పవన్' రన్‌వే మీదకి వచ్చి టేకాఫ్‌కి సిద్ధంగా ఆగింది. దూరం నుంచి విమానం శబ్దాన్ని విన్న పిల్ల లంతా హడావుడిగా లేచి అద్దాల్లోంచి చూస్తూ నుంచున్నారు.

పాలమ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పాస్‌పోర్టు సైజు ప్రపంచంలా ఉంది. మార్చి నెల ఇంకా చిరు చలిగా ఉంది. విమానంలో వెళ్ళేవారు కాబట్టి ఇండియ న్సంతా సూటుల్లోనే ఉన్నారు. మిగతా దేశాలవాళ్ళల్లో నిక్కరూ బనియనూ మాత్రమే వేసుకున్న పురుషులూ, స్త్రీలూ కూడా ఉన్నారు. విదేశీయుల పిల్లలు మాత్రం కొందరు రక రకాల ఇండియన్ డ్రస్సుల్లో ఉన్నారు. పైవాళ్ళ ఫాష నేదయినా బాగానే ఉంటుంది!

రిటైర్డు జస్టిస్ రంగనాధంగారూ, వారి శ్రీమతి కామాక్షమ్మగారూ లౌంజ్‌లో కూర్చుని ఉన్నారు. వారికి వీడ్కోలు చెప్పడానికి వచ్చిన ప్రముఖుల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగారి లాంటి హేమాహేమీ లున్నారు. వారి మంచితనం, పలుకుబడీ అలాంటివి మరి. సుప్రీం కోర్టు జడ్జిగా ఉండి ఎన్నో వివాదాస్పదమైన కేసుల్లో నిష్పక్షపాతంగా జడ్జిమెంటిచ్చా రాయన. అన్ని పక్షాల రాజకీయ నాయకులకూ ఆయన న్యాయ పరిజ్ఞానంపైన అఖండమైన విశ్వాసం. అలాంటి రంగనాథంగారు తన సూటూ బూటూ వదిలేసి అచ్చమైన ఆంధ్రుడిలా పంచ లాల్చీలపైన శాలువా కప్పుకుని కూర్చున్నారు. పక్కనే గుంటూరు జరీ చీరలో కామాక్షమ్మగారు. పెద్ద కొడుకూ, ఉన్న ఒక్క కూతురూ కలిసి నడుపుతున్న నర్సింగుహోమును చూడటానికీ, అక్కడి వాతావరణం నచ్చితే అక్కడే ఉండిపోవడానికీ బయలుదేరారు వారు. పిల్ల లక్కడే సెటి లైపోదా మంటున్నారు. ఇండియా వదిలి వెళ్ళకూడ దనుకున్నారు ముందు. కానీ పిల్లల్ని వదులుకోలేకపోతున్నారు.

కామాక్షమ్మగారు మాత్రం తన దేవుడి సింహాసనం, ఆరు వ్రతాల పుస్తకంతో సహా బయలుదేరారు.

"నీ సింహాసనం మెరుపు చూసి కస్టమ్సు వాళ్ళు బంగార మని పట్టుకోగల రోయ్" అని ఏడిపించేరు కూడాను రంగనాధంగారు.

** ** **

ఎనౌన్సుమెంట్ మొదలయింది. అంత సెక్యూరిటీ చెక్ వైపు బయలుదేరారు. ఒక్కొక్కరే క్రాస్ చేసి అవతలికి, గ్లాసువా లవతలికి చేరుకుంటున్నారు. బేగే జంత వెళ్ళిపోయింది. అద్దాల అవతలా, ఇవతలా అంత చేతు లూపుతున్నారు. విమానానికి మెట్లు తగిలించారు. ఒక్కొక్క గ్రూపుగా మె ట్లెక్కుతున్నారు. ద్వారం దగ్గర నిలబడిన ఎయిర్ హోస్టెసు లిద్దరూ లిప్‌స్టిక్ పెదా లంటుకోకుండా చిరునవ్వుతో 'నమస్తే' చెప్పి మరీ సీట్ల వద్దకు పంపిస్తున్నారు.

సగంమంది లోపలి కెళ్ళారు. లౌంజ్‌లో విజిటర్సు అంత విమానం వేపే చూస్తున్నారు.

విమానం దగ్గర ఒక్కసారిగా కోలాహలం. ఎక్కబోతున్నవాళ్ళంత హడావుడిగా దిగిపోతున్నారు. లోపల కూర్చున్నవాళ్ళు కూడా తోసుకుంటూ దిగిపోతున్నారు. ఆడవాళ్ళు రుమాళ్ళతో కళ్ళూ, ముక్కులూ తుడుచుకుంటూ పరిగెడుతున్నారు. పాసింజరు ట్రయిను కెళ్ళే పల్లెటూరి జనంలా పిల్లల్ని ఈడ్చుకుంటూ, సామాను పడిపోతున్నా లెక్క చెయ్యకుండా పరిగెడుతున్నారు.


ఇవతల వాళ్ళ కేమీ అర్థం కావటంలేదు. ఇంతలో ఎనౌన్స్‌మెంట్ వినిపిస్తోంది ఇంగ్లీషులోనూ, హిందీలోనూ-'అంత సురక్షితంగానే ఉంది ప్రమాదమీ లే దంటూ.

** ** **

ఇండియన్ ఎయిర్ లైనర్ 'పవన్'లో బాం బున్నట్లు ఎవరో అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసేడు.

పాసింజ ర్సందర్నీ దింపేసి విమానం ఖాళీ చేసి పోర్టబుల్ బాంబ్ చెకర్‌తో చెక్ చేస్తున్నారు. పైల ట్సిద్దరూ కూడా దిగిపోయేరు. అందులో ఒకరికి గుబురు మీసాలూ, గడ్డమూ ఉన్నాయి. అతన్ని చూసి అంత చెవులు కొరుక్కోవటం మొదలుపెట్టేరు.

"ఫోనులో చెప్పిన విషయం రైటే అయి ఉండా"లని ఒక రంటే, "అదుగో మొన్న కనిష్కని పేల్చెయ్య లేదూ సూటుకేసు బాంబు పెట్టీ" అని మరొకరు-అ పైలట్ సిక్కు టెర్రరి స్టయి ఉంటాడని ఇంకొకరు.



వాతావరణం అంత చాలా వేడిగా ఉంది. ఫ్లైటు కేన్సి లయితే సామా నెలా తీసుకోవడమా అని భయపడుతున్నారు.

కామాక్షమ్మగారు మనసులో లలితా సహస్రం చదువుకుంటూ కూర్చున్నారు. "ఇల్లు కదిలి ఇన్నాళ్ళకి బయల్దేరితే, వాళ్ళకు బాంబు పెట్టడానికి ఇవ్వాళే ముహూర్తం కుదరాలా" అని బాధపడుతున్నా రామె.


రంగనాధంగారు మాత్రం చిద్విలాసంగా కూర్చున్నారు.

ఆయన్ను చూస్తుంటే కామాక్షమ్మగారికి చిరాగ్గానూ, ఉడుకుమోతుతనం గానూ ఉంది.

ఈ మని షెప్పుడూ ఇంతే. ఎవరికేనా ఉరిశిక్ష వేసి న్నాడూ ఇదే ముఖం. ఆత్మగౌరవం కోసం ఉద్యోగానికి రిజై నిచ్చిన్నాడూ ఇదే ముఖం!

** ** **

విమానాన్ని చెక్ చేసిన అధికారులు కాక్‌పిట్‌లోంచి ఒక చెక్కపెట్టెను అతి జాగ్రత్తగా



పైకి దించి, ట్రాలీ మీద కదిలీ కదలనట్లు తీసుకెళ్ళేరు. దాడీవాలా పైలట్ వెంటనే అరెస్టు అయ్యారు. గంట తర్వాత ఫ్లైటు ఆలస్యానికి చింతిస్తూ పాసెంజ ర్సందరినీ తమ సీట్లకు చేరుకోవలసిందని ఎనౌన్స్ చేసేరు. భయం భయంగా కదిలే రందరూ.

కామాక్షమ్మగారి కంట నీరు' ఆపుకోలేకపోతున్నారు. కూడా ఉన్న వాళ్ళు భయంలేదని ఊరడిస్తున్నారు. రంగనాధంగారు మాత్రం అదే చిద్విలాసంతో మె ల్లెక్కి ఎయిర్ హెూస్టెస్‌ని 'హలో' అని పలకరించి మరీ తన సీట్లో భార్య పక్కన కూర్చున్నారు. 'మరేం ఫరవాలే' దన్నట్లు ఆవిడ భుజం మీద చెయ్యి వేశారు.

కామాక్షమ్మగారు భోరుమన్నా రాయన భుజం మీద వాలి.

"ఊరుకో ఊరుకో" అంటున్నా రాయన.

** ** **

సంగీత మంటే ఎంత అభిమానమో ఆవిడకి. గురువుగారితో పాటు కచ్చేరీలకు కూడా వెళ్ళేది. తరవాత పెళ్ళీ పిల్లలూ భర్త హెూదా, వచ్చేపోయేవాళ్ళూ, సమాజాలూ, సమావేశాలతో ఆవిడ కీ ముప్ఫయ్యేళ్ళలో ఆ హార్మోనియం ముట్టుకోవడానికి వీ లవలేదు. పైగా రంగనాధంగారి కావిడ పాట ఎం తిష్టమో, ఆవిడ హార్మోనియం అంటే అంత ఎగతాళి. ఆవిడ దాన్ని ముట్టుకోకపోవటాని కసలు అదే కారణం.

ఇన్నాళ్ళకి పిల్లల దగ్గర కెళ్ళాకైనా హాయిగా హార్మోనియం వాయించుకుంటూ మనవలకి సంగీతం నేర్పుకుందా మనుకున్నారు.

తాము వెళుతున్న ఈ ఫ్లైటుకి చిన్న కొడుకే పైలట్. ఆ గడ్డం ఒకటి ఒద్దురా అంటే వినకుండా పెంచుతాడు-ఎలాగో వాడిని బ్రతిమాలుకుని వాళ్ళ నాన్నగారికి తెలియకుండా ఆ హార్మోనియం పెట్టెని కాక్‌పిట్‌లో తీసికెళ్ళటానికి ఒప్పించారు. 'అక్కడ దిగాక ఆయ నేమంటారులే' అని సమాధానపరుచుకున్నారు. తీరా అయిందీ మరొక టిప్పుడు. ఎవరి కెలా తెలిసిందో ఈ పెట్టె సంగతి. దొంగవెధవ, ఎవడు ఫోన్ చేసేడో, ఎప్పుడో ఈయన శిక్ష వేసినవాడే ఎవడో అయుంటాడు. లేకపోతే ఏ సి.ఐ.డి.గాడో-ఇందిరాగాంధీని చంపడానికి ప్లా నేసేరని తెలుసుకోలేరు గానీ‍ఇా వెధవ చెక్క పెట్టె గురించి మాత్రం తెలుసుకోగలరా?

కామాక్షమ్మగారి మన సుడికిపోతోంది. కొడుకు అరె స్టవడానికి తనే కదా కారణం అని దుఃఖంగా ఉం దావిడకి. తెలుగులో ఆవిడ ఉపయోగించగల తి ట్లన్నీ తిడుతున్నారు ఫోను చేసినవాణ్ణి.

పాతికేళ్ళు జడ్జిగా పనిచేసిన రంగనాధంగారి కన్ను కప్పలేకపోయే నని, ఆయనతో ముప్ఫయి ఏళ్ళై సంసారం చేస్తున్న ఆవిడ గ్రహించలేకపోయేరు. తన ప్రిన్సిపుల్స్‌కి విరుద్ధంగా డబ్బు ఖర్చుపెట్టి మరీ ఫోను చేయించిన రంగనాధంగారు ప్లేను దిగ్గానే కొడుకుని విడిపించడానికి చెయ్యవలసిన ఫోను కాల్ గురించి ఆలోచిస్తూ చిరునవ్వు నవ్వుకుంటున్నారు-

ఈ వయసులో తను చెయ్యవలసిన పనేనా ఇదీ అని!

*

